సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 29 । జూన్ । 2025



ఇల్లెందులో కోల్డ్ స్టోరేజీ..

ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

8లో



'నివేదన'.. పరిశీలన

ధూప దీప నివేదన(డీడీఎన్) పథకానికి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 205 దరఖాస్తులు అందాయి.

8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. ఆ తర్వాత సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని కాకినాడకు చెందిన భక్తురాలు సత్య అనురాధ రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

అశ్వాపురం: పెండింగ్‌లో కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ రోహిత్‌రాజు పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, గదులను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కేసుల వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ రికవరీని కాపాడాలి



పామాయిల్ ఫ్యాక్టరీలో పరిశీలిస్తున్న అధికారులు

అశ్వారావుపేట/దమ్మపేట: ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ఆయిల్ రికవరీని కాపాడాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ సూచించారు. శనివారం అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలను నారంవారిగూడెంలోని ఆయిల్‌పామ్ నర్సరీని ఆయన సందర్శించారు. ఫ్యాక్టరీలో జరుగుతున్న పనులు, గెలల క్రషింగ్ సామర్థ్యంపై అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ఆయిల్ రికవరీ శాతం తగ్గకుండా ఉండేందుకు గెలల దిగుమతి నుంచి క్రూడాయిల్ సేకరణ వరకు అన్ని అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పక్వానికి రాని గెలలను తీసుకురావొద్దని రైతులను సూచించాలన్నారు. ప్లాంట్ల మేనేజర్లు ఎం.నాగబాబు, సత్యనారాయణ, అధికారులు పవన్, కళ్యాణ్, వెంకటేష్, కార్తీక్, రాజేష్, శివ,రాధాకృష్ణ ఉన్నారు.

వేణుగోపాలా..
అలనాటి ప్రాభవమేది..?

అనాదిగా నదీ తీరాలు నాగరికతకు కేంద్రాలుగా వర్ధిలాయి. ఇదే ఒరవడిలో గోదావరి నది వెంబడి ఒకప్పుడు వెలుగు వెలిగిన ప్రదేశాలు ఆనాటి ప్రాభవం కోల్పోయాయి. ఇందుకు బూర్గంపాడు మండలంలోని మోతె వీరభద్రస్వామి, ఇరవెండి సంతాన వేణుగోపాల స్వామి ఆలయాలే నిదర్శనంగా చెప్పవచ్చు.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- ఇరవెండిలో శతాబ్దాలనాటి సంతాన వేణుగోపాలస్వామి ఆలయం
- ఒకప్పుడు వెండిపూలతో నిత్యం అర్చనలు
- ప్రస్తుతం ధూపదీప నైవేద్యాలకే పరిమితం
- చారిత్రక ప్రాంతాలపై దృష్టి పెట్టని జిల్లా అధికారులు



గోదావరి తీరంలో ఎత్తైన కొండపై కొలువైన సంతాన వేణుగోపాలస్వామి ఆలయం



లక్ష్మీమంటపం ద్వారం



ఆలయంలోని ఆళ్వారుల విగ్రహాలు

వెండిపూలతో పూజలు

జిల్లా చరిత్రపై ఇప్పటికీ సరైన పరిశోధనలు జరగడం లేదు. పాల్వంచ సంస్థానం కేంద్రంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం, అంతకు ముందు నైజాం జమానాలో చర్ల కేంద్రంగా కొనసాగిన పాలన, బొగ్గు గనుల పేరుతో ఇల్లెందులో బ్రిటీషర్లు వదిలి వెళ్లిన గుర్తులు ఇప్పటికీ ఈజిల్లా వాసులకు పెద్దగా తెలియ దు. అంతకుముందు చోళులు, రాష్ట్రకూటులు, కాకతీయుల కాలంలో చోటు చేసుకున్న సంఘటనలు చరిత్రలో కలిసిపోయినప్పటికీ.. ఇంకా మౌనసాక్షులుగా మోతె వీరభద్రస్వామి ఆలయం, ఇరవెండి సంతాన వేణుగోపాలస్వామి ఆలయాలు నిలిచి ఉన్నా యి. గోదావరి తీరం వెంబడి మోతె పరిపాలన కేంద్రంగా ఉంటే ఇరవెండి గ్రామం అగ్రహారంగా ఉండేదని తెలుస్తోంది. ఇక్కడున్న సంతాన వేణుగోపాల స్వామికి వెండి పూలతో ప్రతీ రోజు అర్చన చేయడంతో ఈ గ్రామానికి ఇరవెండి అనే పేరు స్థిరపడిపోయినట్టు స్థానికులు చెబుతున్నారు.

1400 ఏళ్లకు పూర్వం

సంతాన వేణుగోపాల స్వామి ఆలయం 1400 ఏళ్లకు పూర్వం నాటిదని ఇక్కడ పూజలు నిర్వహించే అర్చకులు చెబుతున్నారు. వైష్ణవఆలయాల్లో నిర్మించే లక్ష్మీ మండప ద్వారం.. ఆలయ నిర్మాణం జరిగిన వెయ్యేళ్లకు కచ్చితంగా పగులుతుందని ఆగమ శాస్త్రాల్లో పేర్కొన్నారంటూ ఇక్కడున్న ఆలయ ద్వారానికి కూ డా పగులు ఉండటాన్ని వారు ఉదహరిస్తున్నారు. దీనికి తోడు పాల్వంచ తహసీల్దార్‌గా ఈ ప్రాంతానికి వచ్చిన కంచర్ల గోపన్న నేలకొండపల్లిలో ఉన్నప్పుడు వేణుగోపాలుడి భక్తుడని, భద్రాచలంలో సీతా సమే త శ్రీరాముడికి ఆలయం నిర్మించే ముందు తరుచుగా ఇరవెండి వేణుగోపాలుడిని దర్శించుకునేవాడని భద్రాచలం వాసులు చెబుతున్నారు. ఇక్కడ వేణుగోపాలస్వామి ఆలయ నమూనాలోనే భద్రాచలం ఆలయం కూడా ఉంటుందని వారు అంటున్నారు. లక్ష్మీ మంటప ద్వారం పగుళ్లు, భక్త రామదాసు (కంచర్ల గోపన్న)ల కాలాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ఆలయానికి 1400 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, చోళుల కాలంలో నిర్మించి ఉంటారని అంచనా వేస్తున్నారు.

వరదలతో..

గోదావరి తీరంలో ఎత్తైన కొండపై ఉన్న సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఉత్సవాలు జరిగినప్పుడు వంద కేజీల నువ్వులు, బెల్లం ప్రసాదం తయారు చేసిన సరిపోదనే కథ ప్రచారంలో ఉంది. గోదావరికి వరదలొచ్చినప్పుడు ఆల యం ముంపున కు గురి కాలేదని, కానీ చుట్టూ ఉన్న ఊళ్లు మునిగిపోయాయని, అలా నెమ్మదిగా ఇక్కడున్న వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా 1953, 1986లలో వచ్చిన వరదలతో ఈ చారిత్రక ఆలయం క్రమంగా తన ప్రాభవం కోల్పోయినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం ధూపదీప నైవేద్యాలకే ఈ ఆలయం పరిమితమవుతోంది. హోలీ పండుగ సమయంలో ఇక్కడ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడికి ఘనంగా పెళ్లి వేడుక జరిపిస్తారు. అప్పుడు భక్తులతో ఈ ప్రాంతం కళకళలాడుతుంది.

ప్రచారం కల్పిస్తే

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పుణ్యక్షేత్రానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలో మోతె వీరభద్రుడు, 13 కిలోమీటర్ల దూరంలో ఇరవెండి వేణుగోపాలస్వామి ఆలయాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన చరిత్రపై శాస్త్రీయ ఆధారాలు సంపాదించి, సరైన రీతిలో ప్రచారం చేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తే పర్యాటకం పరంగా భద్రాచలం ప్రాంతానికి మరింత గుర్తింపు వస్తుందనడంలో సందేహం లేదు.

కానరాని పరిశోధనలు

ఇరవెండి సంతాన వేణుగోపాలస్వామి, మోతె వీరభద్రుడి ఆలయాల నిర్మాణ శైలిని పరిశీలిస్తే కాకతీయు కాలం లేదా అంతకంటే ముందువని పరిశోధకులు చెబుతున్నారు. అయితే ఈ ఆలయాలను ఎవరు నిర్మించారు? ఏ కాలంలో నిర్మించారనే ఆధారాలు శిలాశాసన రూపంలోకానీ, గ్రంథ రూపంలో కానీ లభ్యం కాలేదు. భక్తరామదాసు రచనలు, రామదాసు గురించి ఇతరుల రచనల్లో కూడా ఈ ఆలయాల ప్రస్తావన లేదు. ఘనమైన చరిత్ర కలిగిన ఈ ఆలయాలు వారసత్వ సంపదగా ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఇక్కడి చరిత్రపై పరిశోధనలు చేసే బృందాలు పెరిగాయి. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలు కేంద్రంగా రీసెర్చ్‌లు జరుగుతున్నాయి. భద్రాద్రి జిల్లా విషయంలోనూ ఈ తరహా పరిశోధనలకు ప్రోత్సాహం అందివ్వాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది.

కరెంట్‌తో అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ ఎస్‌ఈ మహేందర్



సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ వినియోగదారులు, ప్రధానంగా రైతులువిద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఎస్‌ఈ జి.మహేందర్ తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను ఆయన వివరించారు. ఎవరూ సొంతంగా విద్యుత్ సంబంధిత మరమ్మతులు చేపట్టొద్దని సూచించారు.

ఇవి పాటించాలి

- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దు. ప్రమాదకరంగా ఉన్నట్లు గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలి.
- ఇళ్లలో బట్టలు ఆరవేసేందుకు ప్లాస్టిక్ దండేలను మాత్రమే వినియోగించాలి
- ఇంటి ముందు రేకులకు కూడా విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉంటుంది. విద్యుత్ సరఫరా అయ్యే వైర్లను ఎట్టి పరిస్థితుల్లో దండేలకు, రేకులకు తగలకుండా జాగ్రత్త వహించాలి
- యజమానులు పశువులను మేతకు తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలి. విద్యుత్ వైర్లు కిందపడి ఉంటే గమనించి పశువులను దూరంగా తోలుకెళ్లాలి.
- ఇంటి వైరింగ్‌కు ఎర్తింగ్ చేయాలి. నాణ్యమైన ప్లగ్గులను సెల్ చార్జర్లకు వినియోగించాలి
- ఎవరికైనా పొరపాటున విద్యుత్ షాక్ సంభవిస్తే సమీపంలోని వ్యక్తులు అతని తాకొద్దు. అతన్ని కాపాడేందుకు కర్ర, ప్లాస్టిక్ వస్తువులు వాడాలి.
- వినియోగదారులు గృహాల్లో నాణ్యమైన వైరింగ్ చేయించుకోవాలి. రైతులు స్విచ్ బోర్డులు/మోటారు స్టార్టర్ల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించక పోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి
- వ్యవసాయ మోటార్ల వద్ద వైర్లకు ఇన్సులేషన్ తొలగిపోయే అవకాశం ఉంది. ఫుట్ వాల్వులు, ఇతర ఇనుప పరికరాలకు విద్యుత్ ప్రసారమయ్యే అవకాశం ఉంటుంది. రైతులు నిత్యం అప్రమత్తంగా ఉండాలి. విధిగా ఎర్తింగ్ చేయాలి.
- అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతో మాత్రమే వినియోగదారులు, రైతులు పనులు చేయించుకోవాలి
- విద్యుత్ కంచె ఏర్పాటు చేయొద్దు. ఇది చట్టరీత్యా నేరం.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం వంటివి చేయొద్దు. ఆ పనులను విద్యుత్ సిబ్బందితోనే చేయించాలి.
- వ్యవసాయ మోటార్లకు, గృహాల్లో నాణ్యత కలిగిన, అతుకులు లేని సర్వీస్ వైరును మాత్రమే వినియోగించాలి.
- గ్రామీణ వినియోగదారులు విద్యుత్ సిబ్బంది లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్‌లను సంప్రదించి సేవలు పొందాలి.
- ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా టోల్ ఫ్రీ నంబర్ 1912 సమాచారం ఇవ్వాలి.

కెపాసిటర్ అమర్చుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ ఎస్‌ఈ మహేందర్ తదితరులు

జూలూరుపాడు: రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్ అమర్చుకోవాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ జి మహేందర్ సూచించారు. శనివా రం వినోభానగర్‌లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ మోటార్లకు కెపాసిటర్ అమర్చకపోవడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక భారం పడటంతో కాలిపోతాయన్నారు. ఇంట్లో బట్టలు ఆరవేసేందుకు దండెంగా జీఐ వైరు వినియోగించొద్దని అన్నారు. డీఈలు కృష్ణ, జి.రంగస్వామి, ఏఈ నరసింహారావు, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కూలీలతో కలిసి.. విత్తనాలు వేసి..



మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య శనివారం ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపనకు వెళ్తున్న క్రమంలో మామిడిగుండాల గ్రామ సమీపంలో చేనులో కూలీలు మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్నారు. గమనించిన ఎమ్మెల్యే వారి వద్దకు వెళ్లి మొక్కజొన్న విత్తనాలు నాటారు. వ్యవసాయ కూలీలతో కొద్దిసేపు ముచ్చటించారు. ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, అటామిక్ ఎనర్జీ ఎడ్యుకేషన్ సొసైటీ, ఏకలవ్య, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ జూలై 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అప్‌లోడ్ చేసిన వివరాల కాపీలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని డీఈఓ పేర్కొన్నారు.

'ఉపాధి'లో నిబంధనలు పాటించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి: నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పనులు చేపట్టాలని, లేనిపక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో ఎంపీడీఓలు, పీఆర్ ఏఈలు, ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతి కూలీకి కనీస వేతనం రోజుకు రూ.300 వచ్చేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీ, అంగన్ వాడీ కేంద్రాల భవనాల పనులు ప్రారంభించాలని చెప్పారు. వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన పాలసీలను నమోదు చేయించాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ఫేస్–11లో జిల్లాలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు 16 మంజూరుకాగా, నాలుగింటి పనులే ప్రారంభించారని, మిగిలిన 12 పనులను మొదలు పెట్టాలని సూచించారు. డీఆర్‌డీఓ ఎం. విద్యాచందన, జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, అదనపు డీఆర్‌డీఓ ఎన్. రవి పాల్గొన్నారు.

ముగిసిన దోస్త్ గడువు

పాల్వంచరూరల్: జిల్లాలో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ దోస్త్ మూడో విడత గడువు శనివారంతో ముగిసింది. మే 30 నుంచి ఈ నెల 28 వరకు మూడు విడుతలుగా అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ ప్రక్రియ కొనసాగనుండగా, జూలై 1 నుంచి తరగతులు ప్రారంభంకానున్నాయి. జిల్లాలోని 9 డిగ్రీ కళాశాలల్లో 3,900 సీట్లు ఉండగా, ఇప్పటి వరకు 1,725 మంది చేరారు. ఇంకా 2,175 ఖాళీలు ఉన్నాయి. మూడు విడతలుగా అడ్మిషన్లు నిర్వహించినా సగం సీట్లు కూడా భర్తీ కాలేదు.

'సర్వే'శ్వరా..!

- గౌరవ వేతనం కోసం ఎన్యుమరేటర్ల ఎదురుచూపులు
- గతేడాది నవంబర్‌లో సమగ్ర కుటుంబ సర్వే
- ఏడు నెలలు గడిచినా చెల్లింపులు చేపట్టని ప్రభుత్వం



సర్వేలో వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు(ఫైల్)

చుంచుపల్లి: గతేడాది నవంబర్‌లో ప్రభుత్వం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే చేపట్టింది. ఏడు నెలలు గడిచినా ఆ సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటివరకు గౌరవ వేతనం చెల్లించలేదు. ఎప్పుడు చెల్లిస్తామనే విషయం కూడా ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. దీంతో ఎన్యుమరరేటర్లు, ఆపరేటర్లు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు పెంచడంతోపాటు సంక్షేమ పథకాల అమలుకు గతేడాది నవంబర్ 6 నుంచి 21 వరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే చేపట్టింది. జిల్లాలో సర్వేలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ వార్డు అధికారులు, సెర్ప్ సిబ్బంది, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా పని చేశారు. ఒక్కొక్కరు 150 కుటుంబాల వరకు సర్వే చేశారు. అనంతరం నవంబర్ 22 నుంచి డిసెంబర్ 6 వరకు వివరాలను 1,753 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

4,372 మంది సిబ్బంది సేవలు

సమగ్ర కుటుంబ సర్వేలో 2,383 మంది ఎన్యుమరేటర్లు, 236 మంది సూపర్‌వైజర్లు పనిచేశారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 103 వార్డులు, 481 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 3,36,407 కుటుంబాల నుంచి సుమారు 20 రోజులపాటు వివరాలు సేకరించారు. ఎన్యుమరేటర్లకు రూ.10 వేల చొప్పున, సూపర్ వైజర్లకు రూ.12 వేల చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో దరఖాస్తుకు రూ.7 చొప్పున ఇస్తామని చెప్పింది. మొత్తం ఆపరేటర్లందరికీ కలిపి సుమారు రూ.3.40 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు చెల్లించకపోవడంతో ఎన్యుమరేటర్లు మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సర్వే జరిపిన కుటుంబాలు:	3,36,407
సేవలందించిన సిబ్బంది:	4,372
చెల్లించాల్సి పారితోషికం (సుమారు):	రూ. 3.40 కోట్లు

కష్టపడి పనిచేశాం



సమగ్ర కుటుంబ సర్వే దరఖాస్తులను రాత్రింబవళ్లు కష్టపడి ఆన్‌లైన్ చేశాం. రోజుకు 30 నుంచి 40 వరకు దరఖాస్తుల వివరాలు నమోదు చేశాం. వీటి డబ్బుల కోసం ఏడు నెలలుగా ఎదురు చూస్తున్నాం.

– భూక్యా కిషోర్, డేటా ఎంట్రీ ఆపరేటర్

విడుదల చేయాలి



ఒక్కో ఆపరేటర్ 400 నుంచి 550 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. ఆ ప్రకారం పారితోషికం చెల్లించాల్సి ఉంది. త్వరగా విడుదల చేసేలా జిల్లా అధికారులు చొరవ తీసుకోవాలి.

–పి.సతీష్, డేటా ఎంట్రీ ఆపరేటర్

సంప్రదాయానికే మొగ్గు..

ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపని రైతులు

- జిల్లాలో మరీ తక్కువగా నూనె పంటల సాగు
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న కర్షకులు



బూర్గంపాడులో సాగు చేసిన పత్తి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించాలంటే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు సూచిస్తున్నారు. కానీ రైతులు మాత్రం సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న, వాణిజ్య పంటలు పత్తి, మిర్చి వైపే మొగ్గు చూపుతున్నారు. ఆయిల్ పామ్, మునగసాగు విషయంలో మాత్రం అధికారుల కృషి ఫలిస్తోంది. నూనె పంటలైన వేరుశెనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, మద్దతు ధర లభిస్తుందని అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నా సుముఖత వ్యక్తం చేయడంలేదు. దీంతో జిల్లాలో సంప్రదాయ పంటలే అధిక విస్తీర్ణంలో సాగవుతున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో కూడా అదే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో వరి 1,60,956 ఎకరాల్లో, మొక్కజొన్న 85,544 ఎకరాల్లో, పత్తి అత్యధికంగా 2,04,632 ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

ఆయిల్‌పామ్‌లో ప్రథమస్థానం..

వ్యవసాయ, ఉద్యానశాఖల కృషితో ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉంటోంది. అంతర పంటలకు సాగుకు అవకాశం, రాయితీలు అధికంగా ఉండటం, ప్రకృతి వైపరీత్యాలకు తోటలు దెబ్బతినకపోవడంతో పలువురు రైతులు ఆయిల్‌పామ్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఈ వానాకాలంలో 75 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు సిద్ధమయ్యారు. ఇక నూనె పంటల్లో వేరుశెనగ 2,791 ఎకరాల్లో సాగు చేయనుండగా మిగతా పంటలు నామమాత్రంగా సాగు చేయనున్నారు. ఇటీవల కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మునగ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ విస్తృత ప్రచారం చేయడంతో కొందరు రైతులు మునగ వైపు మొగ్గు చూపుతున్నారు. గత వానాకాలంలో 550 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 2,500 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది. కూరగాయల సాగుతో ఎక్కువ ఆదాయం లభించే అవకాశం ఉన్నా రైతులు ఆ దిశగా దృష్టి సారించడంలేదు. దీంతో జిల్లా ప్రజల కోసం కూరగాయలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సివస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు వస్తే సంప్రదాయ పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతుల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రత్యామ్నాయంతోనే ఆర్థిక పరిపుష్టి



రైతులు లాభాలను తెచ్చిపెట్టే ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలి. ఆ దిశగా వ్యవసాయ శాఖ అవగాహనా కార్యక్రమాలు చేపడుతోంది. కలెక్టర్ చొరవతో మునగ సాగు చేస్తున్న రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారు.

– వి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

అలవాటై పోయాయి



సంప్రదాయ పంటలు అలవాటై పోయాయి. మొదటి నుంచి పత్తినే ఎక్కువగా వేస్తాం. ఈసారి మాత్రం వర్షాభావం వల్ల రెండుసార్లు విత్తనాలు వేసినా మొలకెత్తలేదు. నష్టం జరిగింది. మూడోసారి వేశాం.

– గుగులోత్ లక్ష్మా, రైతు, సీతంపేట బంజర, సుజాతనగర్ మండలం

పూర్తిస్థాయి అవగాహన లేదు



ప్రత్యామ్నాయ పంటల గురించి అధికారులు చెబుతున్నా ధైర్యం సరిపోవటం లేదు. పూర్తిస్థాయిలో అవగాహన లేదు. అందుకే ఎప్పటిలాగే సంప్రదాయ పంటలను పండిస్తున్నాం.

– పోలెబోయిన ముసలయ్య, రైతు, కరకగూడెం మండలం

క్లుప్తంగా

చిన్నారికి కలెక్టర్ అభినందన



ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్, డీఎఫ్‌ఓ

చుంచుపల్లి: పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతు బాధ్యతగా కృషి చేస్తూ 'వాక్ ఫర్ ట్రీస్'అనే అంశంతో ప్రతిరోజూ మొక్కలు నాటుతున్న చిన్నారి మూడు విశ్వామిత్ర చౌహాన్‌ను శుక్రవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. ఈమేరకు ఇటీవల అడవుల నుంచి సేకరించిన వివిధ రకాల చెట్ల గింజలను అటవీఅధికారులకు అందజేసిన సందర్భంగా శనివారం ప్రశంసపత్రాన్ని అందించారు. అనంతరం విశ్వామిత్రతో కలిసి కలెక్టర్‌తో పాటు డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్ మామిడి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ రాహుల్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థిని ఎంపిక



తరుణను అభినందిస్తున్న ఎంఈఓ

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని అబ్బుగూడెం ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఓరుగంటి తరుణ రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైంది. ఈ నెల 26న ఖమ్మంలో జరిగిన ఎంపికల్లో విద్యార్థిని ప్రతిభ చూపింది. ఈ మేరకు శనివారం పాఠశాలలో బాలికను ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.లక్ష్మణ్, డి.రమేష్, ఎం. బాలు, జి.రామ్మోహన్, ఎ.సుభద్ర పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: నీట్ శిక్షణ తీసుకుంటున్న గిరిజన విద్యార్థిని వజ్జ రోజాకు ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని పీఓ బి.రాహుల్ శనివారం తన చాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖ అంకంపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన రోజా 'పది'ఫలితాల్లో పాఠశాలల్లో 2వ ర్యాంకు, ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 440 మార్కులకు గాను 424 సాధించిందని తెలిపారు. విద్యార్థిని చదువుకు చేయూతనందించేందుకు ఈ సాయం అందించామన్నారు. ఏపీఓ డేవిడ్ రాజ్, ఎస్ఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,748

ఇల్లెందులో కోల్డ్ స్టోరేజీ..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు లేవు. ఏ పంట నిల్వ చేసుకోవాలన్నా ఖమ్మం, మహబూబాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈనేపథ్యాన ప్రస్తుత మార్కెట్ పాలక వర్గం ఇల్లెందు పట్టణ నడిబొడ్డున గల వ్యవసాయ మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి అనువుగా ఉంటుందని భావించి ఓ ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రణాళికలు చేస్తోంది. ఇందుకు తగిన ప్రతిపాదనలను రూపొందించేలా చర్యలు ప్రారంభించింది. – ఇల్లెందు

- మార్కెట్ యార్డులో ఐదు ఎకరాల్లో నిర్మాణం
- ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటు
- లక్ష బస్తాలు నిల్వ దిశగా ప్రణాళిక
- మిర్చి, బెల్లం, ఎల్లిపాయలు, అల్లం, పసుపు నిల్వలకు చాన్స్
- రూ.3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం





కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం, (ఇన్‌సెట్) ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ

పంటల భద్రతకు వీలుగా..

ఇటీవల ఇల్లెందు మార్కెట్‌లో జరిగిన పాలక మండలి సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇల్లెందులో కోల్డ్ స్టోరేజీ నిర్మాణం విషయాన్ని ప్రస్తావించారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో రైతులకు ఉపయోగపడేలా ఇక్కడ కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేపడతామన్నారు. పంటలకు సరైన ధరలు లేనప్పుడు కొంత కాలం దాచేందుకు వీలుగా ఇల్లెందులో ఒక కోల్డ్ స్టోరేజీ నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

ప్రైవేట్ భాగస్వామ్యంతో..

ప్రభుత్వం నుంచి కోల్డ్ స్టోరేజీకి సరిపడా నిధులు విడుదలయ్యే అవకాశం లేదు. ఈ తరుణాన ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్మించాలనుకున్నారు. దీనికి కనీసం 5 ఎకరాల స్థలం కావాల్సి ఉంది. ప్రభుత్వ భవనాలకే స్థలం కొరత తీవ్రంగా ఉండగా.. మండలం వెలుపల నిర్మిద్దామంటే 1/70 చట్టం అడ్డుగా మారబోతుంది. దీన్ని అధిగమించేందుకు ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ యార్డులో 6 ఎకరాల స్థలం ఉంది. ఇక్కడ హమాలీలు రెండు ముఠాలుగా విడిపోయి ఘర్షణలు జరగడంతో ఎన్నో ఏళ్లుగా మార్కెట్ సాగడం లేదు. దీనిలోని గోదాంలు సైతం సరుకు నిల్వకు ఆశించినంత ఉపయోగపడకపోవడంతో సివిల్ సప్లై శాఖ పీడీఎస్ బియ్యం నిల్వకు వినియోగించుకుంటున్నారు. దీనికి తోడు కొంతమంది వ్యాపారులు తమ సరుకు నిల్వలకు వాడుకుంటున్నారు. పడావుపడిన మార్కెట్ యార్డులో పశువులు, కోతులు, కుక్కలకు ఆవాసాలుగా మారిన తరుణంలో కోల్డ్ స్టోరేజీగా మారిస్తే రైతులకు, వ్యాపారుల సరుకు నిల్వలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ దిశగా స్థానిక మార్కెట్ కమిటీ సమాలోచనలు చేస్తోంది.

ఎన్‌ఓసీ అవసరం..

కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ఐదెకరాల భూమి, విద్యుత్, ఫైర్, బీమా, లీగల్ మెట్రాలజీ, పొల్యూషన్ శాఖ నుంచి ఎన్‌ఓసీ కావాల్సి ఉంటుంది. ప్రైవేట్ భాగస్వామ్యంతో అయితే బ్యాంకుల నుంచి రుణం కూడా పొందే అవకాశం ఉంది. నిర్మాణం జరిగితే మార్కెట్‌కు నిరంతరం ఆదాయంతో పాటు సరుకుకు భద్రత కలగనుంది. పడావుపడిన మార్కెట్ యార్డును ఉపయోగంలోకి తెచ్చి సబ్ యార్డుల్లో క్రయవిక్రయాలు సాగించే అవకాశం ఉంటుందని మార్కెట్ అధికారులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో తొలి మార్కెట్ ..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1975 మే నెల 4న ఆనాటి సీఎం జలగం వెంగళరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ నెమరుగొమ్ముల రాఘవేంద్రరావు, ఉపాధ్యక్షుడు పర్సా లక్ష్మీనర్సింహారావులు శంకుస్థాపన చేశారు. ప్రారంభంలో జోరుగా క్రయవిక్రయాలు జరిగిన ఈ మార్కెట్ యార్డులో క్రమంగా చెక్ పోస్టుల ద్వారా ఆదాయం సమకూర్చుకునే దిశకు చేరాయి. ఆరు ఎకరాల స్థలం కలిగిన ఈ మార్కెట్ పరిధిలో ప్రస్తుతం మూడు జిల్లాల్లో ఎనిమిది మండలాల పరిధిలో మార్కెట్ విస్తరించి ఉంది.

కోల్డ్‌స్టోరేజీ లేని జిల్లా..

జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు లేవు. ఎవరైనా నిర్మాణం చేయాలంటే భూమి సమస్య తీవ్రంగా ఉంది. లేదంటే 1/70 చట్టం అడ్డుగా ఉంది. ఇల్లెందులో మార్కెట్ స్థలంలో మాత్రమే ఈ అవకాశం ఉండడంతో పాలక వర్గం ఆవైపుగా దృష్టి సారించింది. ఇక్కడ నిర్మాణం చేపడితే ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, టేకులపల్లి మండలాలతో పాటు భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం వంటి ప్రాంతాల వారు ఉపయోగించుకునే అవకాశం ఉంది. కనీసం లక్ష క్వింటాళ్ల సరుకు నిల్వ చేసేలా నిర్మాణం చేయాలని భావిస్తున్నారు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..



ఇల్లెందులో కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. పాలకులు మారుతున్నారే కానీ దీని నిర్మాణానికి ఎలాంటి ఆలోచన చేయలేదు. ప్రస్తుత పాలక వర్గం ఈ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది.

– బానోతు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్

రైతుల మేలు కోసం..



ఇల్లెందులో గిరిజన రైతుల మేలు కోసం నిర్మించే కోల్డ్ స్టోరేజీ నిర్మాణం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తాం. దీని ద్వారా మిర్చి, ఇతర పంటలతో పాటు వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసుకుని గిట్టుబాటు ధరలు పొందొచ్చు.

– నాళ్ల సోమసుందర్, వ్యాపారి

'నివేదన'.. పరిశీలన

- డీడీఎన్ పథకానికి ఉమ్మడి జిల్లాలో 205 దరఖాస్తులు
- ఈఓలు, అర్చకులతో విచారణ కమిటీల ఏర్పాటు
- నివేదికల ఆధారంగా ఆలయాల ఎంపిక

ఖమ్మంగాంధీచౌక్: ధూపదీప నివేదన(డీడీఎన్) పథకానికి దరఖాస్తు చేసుకున్న ఆలయాల పరిశీ లన ప్రక్రియను దేవాదాయ, ధర్మాదాయ శాఖ చేపట్టింది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మే 1న నోటిఫికేషన్ విడుదల చేసి, అదేనెల 24వ తేదీ తుది గడువుగా నిర్ణయించింది. దీంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి 205 దరఖాస్తులు అందగా.. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీచేయగా.. ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కమిటీలు ఏర్పాటు చేసి, పరిశీలన బాధ్యతలు అప్పగించి నియోజకవర్గాల వారీగా నివేదికలు అందించాలని సూచించారు.

ఆలయాల మనుగడ కోసం..

పురాతన ఆలయాలు మనుగడ కోల్పోతుండగా వాటి పునర్ వైభవం కోసం 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ధూప దీప నివేదన పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 450 ఆలయాలకు ఈ పథకం అమలవుతోంది. ఇటీవల ప్రభుత్వం విడుదల నోటిఫికేషన్ ఆధారంగా ఖమ్మం జిల్లా నుంచి 146, భద్రాద్రి జిల్లా నుంచి 59 ఆలయాల అర్చకులు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. వీటిని దేవా దాయ, ధర్మాదాయ శాఖ నియమించిన కమిటీ పరిశీలించాక అర్హత గల ఆలయాలకు పథకం అమలయ్యే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో ఆరు కమిటీలు..

ఎండోమెంట్ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న ముఖ్య కార్యనిర్వహణాధికారులు, అర్చకులతో దరఖాస్తుల పరిశీలనకు ఖమ్మం జిల్లాలో మూడు, భద్రాద్రి జిల్లాలో మూడు కమిటీలను నియమించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం.. ఆలయం నిర్మించి 15 ఏళ్లు నిండి ఉండాలని, దేవాదాయ శాఖలో రిజిస్ట్రేషన్ చేసి ఉండాలని, ఆలయానికి మెట్ట భూమి ఐదెకరాలు, మాగాణి భూమి 2.50 ఎకరాలకు మించి ఉండరాదని, నిత్యం అర్చకుడు దీపం వెలిగించి నివేదన చేస్తూ ఉండాలని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

నివేదిక ఆధారంగా ఎంపిక..

డీడీఎన్ పథకం దరఖాస్తుల పరిశీలనకు ఎంపిక చేసిన కమిటీలు క్షేత్రస్థాయిలో ఆలయాలను సందర్శించి నివేదిక సేకరించాలి. ఆలయాల వారీగా సేకరించిన నివేదికలను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌క పరిశీలించి తుది నిర్ణయం, అనుమతులను ఉన్నతాధికారులకు పంపిస్తారు. అర్హత సాధించిన ఆలయాలకు ప్రభుత్వం నెలకు రూ.10 వేలు అందిస్తుంది. వీటిలో రూ.6వేలు పడితరం(ఆలయ నిర్వహణ), రూ.4వేలు అర్చకుడికి గౌరవ వేతనంగా చెల్లిస్తారు. ఈ విషయమై దేవాదాయ శాఖ ఏసీ ఎం. వీరస్వామిని వివరణ కోరగా.. డీడీఎన్ నిబంధనల మేరకు ఆలయాల ఎంపిక ఉంటుందని, దీనిపై రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

భద్రాచలంఅర్బన్: నిర్మాణ రంగ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు రక్షించుకునేందుకు వచ్చే నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు తెలిపారు. బండారు చందర్‌రావు భవన్‌లో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల సంక్షేమ చట్టం రద్దయిందని దీన్ని కాపాడుకోవాల్సిన ప్రతీ ఒక్క కార్మికుడిపై ఉందన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నేతలు ఏజే రమేష్, ఎంబీ నర్సారెడ్డి, నరసింహారావు, శరత్‌బాబు, ఎర్రంశెట్టి వెంకటరామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సన్నబియ్యం తూకంపై విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న గిర్దావర్ భద్రు

ములకలపల్లి: ములకలపల్లి రేషన్‌షాపులో బియ్యం తూకం తేడా అంశంపై 'రేషన్ షాపులో మాయాజాలం'శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. తహసీల్దార్ బి.గనియా ఆదేశాల మేరకు గిర్దావర్–2 భద్రు ఆ రేషన్ షాపులోని బియ్యం నిల్వలు, స్టాకు రిజిస్టర్లను పరిశీలించి సేల్స్‌మెన్ అగ్గిరామ్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించనున్నట్లు గిర్దావర్–2 తెలిపారు.

శాస్త్ర విజ్ఞానానికి ప్రయోగశాలలు దోహదం



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

సుజాతనగర్/చంద్రుగొండ: పాఠశాలల్లో ప్రయోగశాలల నిర్వహణ సక్రమంగా లేకపోతే విద్యార్థులు శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి కోల్పోతారని ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ అన్నారు. శనివారం సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో పాటు సాధారణ ప్రయోగశాలలను సందర్శించిన ఆయన వీటి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు ప్రయోగశాలలు ఎంతగానో దోహదపడతాయని, వారిలోని సామర్థ్యాలను వెలికితీసేందుకు ఇవి చాలా అవసరమన్నారు. ప్రయోగశాలలకు ఏమైనా పరికరాలు అవసరమైతే తనను సంప్రదించాలని సూచించారు. అనంతరం ఎస్సెస్సీ విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అలాగే చంద్రుగొండలోని జెడ్పీ హైస్కూల్‌ను ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ సందర్శించి అందులోని అటల్ టింకరింగ్ ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీతో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. సైన్స్‌తోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, సీఎంఓ సైదులు, హెచ్ఎం ఎంఏ వాజీద్, సేవ్యా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై ఆరా



టేకులపల్లి: కేఓసీలో ఆరా తీస్తున్న డైరెక్టర్ (పా)

ఇల్లెందు/టేకులపల్లి: సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు శనివారం సింగరేణి ఇల్లెందు ఏరియాలో పర్యటించి పలు ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేకే ఓసీ, సీహెచ్‌పీని సందర్శించి అక్కడి వ్యూ పాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు జేకే ఓసీ కాల పరిమితి, సీహెచ్‌పీలోని లోడింగ్, బొగ్గు గ్రేడింగ్ పని తీరును ఏరియా జీఎం వీసం కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. అలాగే పూసపల్లి ఓసీ ఏర్పాటు తీరును తెలుసుకున్నాక రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం జాకీర్ హుస్సేన్, డీజీఎం పర్సనల్ తుకారం, అధికారులు పాల్గొన్నారు. అలాగే కోయగూడెం ఓపెన్‌కాస్టును సందర్శించి కేఓసీ వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులపై ఆరా తీసి రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. అనంతరం కేఓసీలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం జాకీర్ హుస్సేన్, కోయగూడెం పీఓ గోవిందరావు, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారం, ఇల్లెందు ఏరియా ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఆళ్ల లోకేష్

దమ్మపేట: మండలంలోని రంగువారిగూడెం ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి ఆళ్ల లోకేష్ రాష్ట్రస్థాయి క్రీడా ప్రతిభ పోటీలకు ఎంపికయ్యాడు. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ఉన్న క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోసం ఈ నెల 26న కొత్తగూడెంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా ప్రతిభ పోటీల్లో ప్రతిభ చూపగా.. జూలై 1 నుంచి 5 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా లోకేష్‌ను ఎంఈఓ కీసర లక్ష్మి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

బాలిక మృతిపై ఫిర్యాదు

ఇల్లెందురూరల్: మండలంలోని మారుమూల గ్రామంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఓ బాలిక ఉదంతంపై ఆమె తల్లిదండ్రులు శనివారం కొమరారం పోలీసుస్టేషన్‌లో మరో ఫిర్యాదు అందించారు. బాలిక మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, అందుకు అనుమానితుల వివరాలు, బాలిక వద్ద లభించిన సెల్‌ఫోన్‌లను పోలీసులకు అందజేశారు. ఈ మేరకు సెల్ ఫోన్ కాల్‌డేటా సేకరించి సమగ్రంగా విచారణ చేపడతామని గుండాల సీఐ రవిందర్ తెలిపారు.

కళలను ప్రోత్సహించడం మనందరి బాధ్యత



మాట్లాడుతున్న సీఈ శ్రీనివాసబాబు

పాల్వంచ: కళలను ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.శ్రీనివాస బాబు అన్నారు. శనివారం స్థానిక కేటీపీఎస్ సీతారామ కల్యాణ మండపంలో పాకాలపాటి కృష్ణయ్య సాంస్కృతిక కళాపీఠం సమక్షాన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర కీలకమైందని అన్నారు. చిన్నప్పటి నుండే కళలపై మక్కువ పెంచుకునేలా కృషి చేయాలని, కళాకారుల ఆదరించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు తోట దేవీప్రసన్న, మధిర రంగ స్థల కళాకారుల సమైఖ్య అధ్యక్షులు పుతుంబాక కృష్ణ ప్రసాద్, బాబులాల్, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, వెంకటాచారి, జొన్నాడ కృష్ణ, ముత్యాల హనుమంతరావు, కృష్ణ, వెంకన్న, రోశయ్య చౌదరి, బాషా, పాకాలపాటి రోశయ్య చౌదరి, దామోదర్‌రావు, బాలస్వామి, పున్నయ్య పాల్గొన్నారు.

సింగరేణిలో మైనింగ్ జీఎంల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పలువురు మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్ఓడీ ఏజే మురళీధర్‌రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం జీఎం మేకల కనకయ్యను ఆర్‌అండ్‌డీ కార్పొరేట్ జీఎంగా బదిలీ చేశారు. కార్పొరేట్‌లోని ఐఅండ్‌పీఎం విభాగం హెచ్ఓడీ అడిషనల్ జీఎం జె.వెంకటరమణకు కొత్తగూడెం రీజియన్ క్వాలిటీ జీఎంగా పదోన్నతి కల్పించారు. సీపీపీ కార్పొరేట్ విభాగంలో అడిషనల్ జీఎంగా విధులు నిర్వహిస్తున్న మిరియాల శ్రీహరికి పదోన్నతి కల్పించి ఐఅండ్‌పీఎం జీఎంగా నియమించారు. బెల్లంపల్లి ఏరియా ఇంజనీర్ మెస్సు రామనాథంను కార్పొరేట్ ట్రాన్స్‌పోర్టు జీఎంగా బదిలీ చేశారు. ఆర్జీ–1 ఎస్ఓటు జీఎంగా విధులు నిర్వహిస్తున్న గోపాల్‌సింగ్‌కు బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ హెచ్ఓడీగా పదోన్నతి కల్పించారు. ఈఅండ్‌ఎం ట్రాన్స్‌పోర్ట్ జీఎం బి.సీతారామ్‌ను సోలార్ విభాగానికి బదిలీ చేశారు. హైదరాబాద్ పీపీడీ విభాగం హెచ్ఓడీ ఎస్.వీ.కే విశ్వనాథరాజును అప్మెల్ ఎండీగా, హైదరాబాద్ ఐటీ విభాగం డీజీఎం గురుప్రసాద్‌ను అక్కడే పీపీడీ విభాగం హెచ్ఓడీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరందరూ నిర్ణీత గడువులో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో యాజమాన్యం పేర్కొంది.

రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ



రియన్‌పఠాన్‌ను అభినందిస్తున్న రైఫిల్ అసోసియేషన్ బాధ్యులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): హైదరాబాద్‌లో జరిగిన 11వ, ఉమ్మడి రాష్ట్ర రైఫిల్ షూటింగ్‌లో మండలంలోని కట్టుగూడెం గ్రామానికి చెందిన బాలుడు రియాన్ పఠాన్ రాణించాడు. హైదరాబాద్‌లో గచ్చిబౌలి షూటింగ్ రేంజ్‌లో శనివారం జరిగిన పోటీల్లో రియాన్ పాల్గొని, ప్రతిభ చూపి, కేరళలో జరగబోయే ప్రీనేషనల్ (సౌత్‌జోన్), ఆలిండియా మౌలాన్క్‌ర్కోలో అతడు స్థానం సాధించాడు. తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జె.కిరణ్, ఏపీ రైఫిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రాజ్‌కుమార్ రియాన్ పఠాన్‌ను సత్కరించారు. ఆయన తండ్రి రహీం పఠాన్ జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పతకాలు సాధించాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

దమ్మపేట: మండలంలోని మందలపల్లి గ్రామ శివారులోని పామాయిల్ క్షేత్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పామాయిల్ క్షేత్రంలో మృతిచెందిన వ్యక్తి మృతదేహాన్ని శనివారం స్థానికులకు కనపడగా.. పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మూడు రోజుల క్రితమే ఆ వ్యక్తి మరణించినట్లుగా భావించారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుందని, అతడి ముఖంపై పలు గాయాలు కాగా రక్తస్రావం జరిగిందని తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట మార్చురీకి తరలించారు. మందలపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి మహాదేవ గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, మృతుడి వివరాలు తెలిసినవారు 87126 82065 నంబర్‌కు తెలపాలని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి సూచించారు.